సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 28 । జూలై । 2024



నైపుణ్య శిక్షణ..

నైపుణ్య శిక్షణపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ట్రైనింగ్ కార్యక్రమాలు మూలకు చేరుతున్నాయి.

- 8లో



రెండు రోజుల కౌన్సెలింగ్‌లో..

ట్రిపుల్ ఐటీ రెండు రోజుల కౌన్సెలింగ్‌లో 863 మందికి ప్రవేశాలు కల్పించారు. కౌన్సెలింగ్ ముగిసింది.

- 8లో

పోస్టర్ల ద్వారా ప్రకటనలు వద్దు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో పోస్టర్ల ద్వారా ప్రకటనలు చేయడం పూర్తిగా నిషేధించామని శ్రీకాకుళం నగర పాలకసంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఆయన శనివారం సినిమా థియేటర్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఎక్కడపడితే అక్కడ ప్రకటన ప్రతులు అంటించ రాదని, ఉల్లంఘించిన వారిపై ఏపీఎంసీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

న్యూస్‌రీల్

నాలుగు క్యాంపస్‌లలో 3396 ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని నాలుగు రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లలో మొదటి విడత ప్రవేశాలు పూర్తి చేసినట్లు అడ్మిషన్ల కన్వీనర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. ఎస్ఎంపురం ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. నాలుగు క్యాంపస్‌లో కౌన్సెలింగ్‌కు 4140 మంది విద్యార్థులను పిలవగా, 3396 మంది ప్రవేశాలు పొందారని తెలిపారు. శ్రీకాకుళంలో 1035 సీట్లకు 863, ఒంగోలులో 1035కి 858, న్యూజివీడులో 1035కి 792, ఆర్‌కే వ్యాలీలో 1035కి 858 ప్రవేశాలు జరిగాయని అన్నారు. ఖాళీ సీట్లకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అన్నారు.

జెమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స



తొలగించిన కణితి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో ఓ మహిళ కడుపులోంచి 9 కేజీల కణితిను జెమ్స్ వైద్యులు శస్త్ర చికిత్స ద్వారా తొలగించి ఆమె ప్రాణాలను కాపాడారు. నరసన్నపేటకు చెందిన నాగమ్మ గత కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధ పడుతోంది. ఎన్నో ప్రైవేట్ ఆస్పత్రులకు తిరిగినా ఆమెకు నయం కాలేదు. ఇటీవల కడుపునొప్పి ఎక్కువై పొట్ట ఉబ్బిపోవడంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చేరింది. జెమ్స్ కేన్సర్ ఆస్పత్రి స్పెషలిస్ట్ బమ్మిడి సందీప్ ఆమెకు పరీక్షలు చేసి కడుపులో 9 కేజీల కణితి ఉన్నట్లు గుర్తించారు. దీన్ని తొలగించే సమయంలో కణితికు చిన్నపాటి రంధ్రమైనా క్యాన్సర్ కణాలు వృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రస్తుతం మొదటి దశలోనే ఆమెకు క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించిన వైద్యులు మూడోదశకు చేరుకొనే అవకాశం లేకుండా కణితిని తొలగించారు. సుమారు 6 గంటలు పాటు శ్రమించి చిన్నరంధ్రం లేకుండా కణితిని తొలగించారు. రోగికి పూర్తి స్థాయిలో కౌన్సిలింగ్ ఇచ్చి బీపీ పెరగకుండా శస్త్ర చికిత్సను పూర్తి చేశారు. రెండురోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి శనివారం నాగమ్మను డిశ్చార్జ్ చేశారు. ఈ శస్త్ర చికిత్సలో జనరల్ సర్జన్ డాక్టర్ శశి, ఎనస్తీషియా వైద్యులు డాక్టర్ శ్రీజ పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ పరిశీలన




అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇసుక బిల్లులను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

కొత్తూరు: అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద విక్రయాలు పారదర్శకంగా నిర్వహించాలని మైన్స్, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులను జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. అంగూరు ఇసుక ర్యాంపును జేసీ శనివారం పరిశీలించారు. స్టాక్ పాయింట్ వద్ద రాత్రి పోలీసు బందోబస్తు నిర్వహించాలని స్థానిక ఎస్ఐ అహ్మద్‌ను ఆదేశించారు. బిల్లులు చెల్లించాకనే స్టాక్ పాయింట్ వద్దకు వాహనాలను లోడింగ్‌కు పంపించాలని, స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు పెట్టాలని, వే బ్రిడ్జిని బాగు చేయాలని సూచించారు. వాహనాల రాకపోకల కారణంగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు జంక రాజేష్, సుదర్శనరావులతో పాటు పలువురు జేసీకి ఫిర్యాదు చేశారు. ఇళ్ల నిర్మాణానికి నాటు బళ్లకు నది నుంచి ఇసుక తీసుకు వచ్చేందుకు అవకాశం ఇవ్వాలని అంగూరుకు చెందిన పలువురు జేసీని కోరారు. దీనికి స్పందించిన జేసీ కార్యదర్శిని ఆదేశించి ఇళ్ల నిర్మాణాలు చేసే వ్యక్తులకు ఇసుక తీసుకు వచ్చేందుకు అనుమతి పత్రాలు అందజేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఇసుక లారీల వల్ల సోమరాజపురం వద్ద కల్వర్టు కూలిపోయిందని, గులుమూరు- నివగాం రోడ్డు పూర్తిగా పాడైపోయిందని సోమరాజపురం వైఎస్సార్‌సీపీ నేత శిమ్మ మధు ఫిర్యాదు చేశారు. టెక్కలి ఆర్డీఓ సుదర్శన దొర, మైన్స్ ఏడీ సత్యనారాయణ, కొత్తూరు ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ త్రివిక్రమరావు, తదితరులు పాల్గొన్నారు.

'మైనర్ డ్రైవింగ్ నేరం'

శ్రీకాకుళం క్రైమ్ : మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమని, లైసెన్సు ఉన్న వాళ్లు మాత్రమే ద్విచక్ర వాహనాలను రోడ్లపై నడపాలని అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్ హెచ్చరించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో ఆధ్యాపకులు, విద్యార్థులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, డ్రగ్స్ వాడరాదని, బాలికలను తప్పుడు ఉద్దేశంతో తాకరాదని, ర్యాగింగ్ చేయరాదని, సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమన్నారు.





చదువులమ్మ చెట్టు నీడలో..

చింతలేని పేట

ఊరంతా చదువుకున్న వారే ఉంటే ఏమవుతుంది..? మద్యం మహమ్మారి ఆ ఊరి గడప తొక్కడానికి భయపడుతుంది. అందరికీ అక్షర జ్ఞానం ఉంటే ఏమవుతుంది.? ఖైనా, పాన్ పరాగ్ వంటి రక్కసులు పొలిమేరకు రావడానికి కూడా జంకుతాయి. సిగరెట్ వాసన అనేదే లేకుండా ఊరు ప్రశాంత పరిమళాలు వెదజల్లుతుంది. కావాలంటే చింతువానిపేట చూడండి. ఇక్కడ 110 ఇళ్లు ఉంటే 12 మంది డాక్టర్లు ఉన్నారు. 422 మంది జనాభా ఉంటే 97 శాతం చదువుకున్న వారే ఉన్నారు. అందుకే ఊరిని సరైన దారిలో నడిపించగలిగారు.

నరసన్నపేట:

కోమర్తి-ఉర్లాం ఆర్ అండ్‌బీ రహదారికి కిలోమీటరు దూరంలో.. ఉర్లాం పంచాయతీలో ఓ చివరన ఒదిగినట్టు ఉంటుంది చింతువానిపేట. చాలా చిన్న గ్రామం. కానీ ఈ పల్లె సాధించిన ఘనతలు చిన్నవి కావు. ఈ గ్రామం నుంచి 12 మంది వైద్య వృత్తిలో ఉన్నారు. వారిలో ఇటీవలే ఒకరు మృతి చెందారు. ప్రస్తుతం మరో ఇద్దరు ఎంబీబీఎస్ చదువుతున్నారు. ఇక్కడి వైద్యులు శ్రీకాకుళం, విశాఖపట్నం, హైదరాబాద్‌తో పాటు అమెరికాలోనూ సేవలు అందిస్తున్నారు.

గ్రామంలో జనాభా కేవలం 422 మాత్రమే. ఉన్న గృహాలు 110 మాత్రమే. అయినా చదువులో, ఉద్యోగాలు పొందడంలో ఈ గ్రామస్తులకు ఎవరూ సాటి రారు. ఈ గ్రామం నుంచి సైనికులుగా 16 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇతర ఉద్యోగాల్లోనూ చాలా మంది ఉన్నారు. గ్రామంలో ఉన్న వారిలో 97 శాతం మంది అక్షరాస్యులే. శాంతి నికేతన్ విద్యా సంస్థల డైరెక్టర్ సురంగి మోహనరావుది ఇదే గ్రామం. జిల్లా ఆఫీసర్‌గా అనేక పదవుల్లో పనిచేసి గ్రామానికి గుర్తింపు తీసుకువచ్చారు.

మొదటి డాక్టర్ రాడ అప్పారావు

గ్రామంలో మొదటి డాక్టర్ రాడ అప్పారావు. ఎంఎస్సీ ఈఎన్‌టీ వైద్యులు. విశాఖలో సుదీర్ఘ కాలం వైద్య సేవలు అందించారు. ఇటీవలే మృతి చెందారు. ఈయనే గ్రామ యువతీ యువకులకు స్ఫూర్తిప్రదాత. తర్వాత తాడేల రామనారాయణరావు, సురంగి రాజావాణి, రాడ పద్మజ, తాడేల శ్రీకాంత్, వాకముల్లు రశ్మిత, నడిమింటి కార్తీక్, మామిడి జయశ్రీ, తాడేల దినేష్, సురంగి కవితలు వైద్య వృత్తి చేపట్టారు. రాడ హైందవి, టంకాల చందనలు ఎంబీబీఎస్ చదువుతున్నారు. సురంగి రాజావాణి అమెరికాలో మెడికల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



చింతువానిపేటలో ప్రధాన వీధి

మత్తు పదార్థాలకు దూరం..

గ్రామంలో బెల్ట్ షాపులు లేవు. ఇతర మత్తు పదార్థాల విక్రయాలు కూడా ఉండవు. సిగరెట్, ఖైనా, పాన్‌పరాగ్ వంటివి కూడా ఎక్కడా కనిపించవు.

పేదలకు సేవే లక్ష్యం



నేను వైద్య వృత్తి చేపట్టి పదేళ్లగా పైనే అవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పలు ప్రాథమిక ఆస్పత్రుల్లో పని చేశాను. గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో నరసన్నపేటలో స్థిరపడ్డాను. మా గ్రామం చింతువానిపేట అని చెప్పుకోడానికి గర్వంగా ఉంది. డాక్టర్ రాడ అప్పారావు నాకు స్ఫూర్తి.

– తాడేల శ్రీకాంత్, పీహెచ్‌సీ వైద్యులు, జలుమూరు

రిమ్స్‌లో పనిచేస్తున్నా



ఎంబీబీఎస్ పూర్తి చేసి మూడేళ్లవుతోంది. ప్రస్తుతం శ్రీకాకుళంలో రిమ్స్‌లో పని చేస్తున్నా. వైద్య వృత్తిని చేపట్టడమే కలగా చిన్నతనం నుంచీ చదివాను. సాధించాను. మా పెద్ద నాన్న సురంగి మోహనరావు నాకు అనేక సలహాలు ఇచ్చారు. ఎక్కడకు వెళ్లినా చింతువానిపేట మా గ్రామం అని గొప్పగా చెప్తుంటాను.

– సురంగి కవిత

ఇసుక తరలిపోకుండా కమిటీలు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అక్రమ ఇసుక తరలిపోకుండా జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇసుక రవాణాకు సంబంధించి ధర నిర్ణయంపై ఆయన ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తరలిపోకుండా మండలాల్లో తహసీల్దార్ల అధ్యక్షతన భూగర్భ గనుల శాఖ, ఎంపీడీఓలు, పోలీసు, ఎస్ఈబీలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు వాహనాలకు అనుమతి ఉంటుందని చెప్పారు. వెయిటింగ్ చార్జీలు లేకుండా రవాణా ధర నిర్ణయించాలన్నారు. రోజుకు 100 ట్రాక్టర్ల ఇసుక సరఫరా చేయాలని ఆదేశించారు. కూపన్లు సరఫరా చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే రవాణా చార్జీలు ఉండాలన్నారు. నాటు బళ్లతో ఒక దగ్గర నిల్వ చేసి లారీలతో తరలిస్తే లారీ సీజ్ చేస్తామన్నారు. స్థానిక అవసరాలకు సంబంధిత పంచాయతీ కార్యదర్శుల ద్వారా నాటు బళ్లతో ఇసుక తీసుకోవచ్చన్నారు. అంతర్‌జిల్లా సరిహద్దు పైడిభీమవరం వద్ద చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంతకు ముందు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఇసుకపై ఎస్ఈబీ చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో 63 కేసులు నమోదు చేశామని, ప్రస్తుతం భూగర్భ గనుల శాఖ పక్కాగా తూకం వేస్తోందని డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి వివరించారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ పరీక్షలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శాఖా పరమైన పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు అధికారులను ఆదేశించారు. ఆదివారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఆరు రోజుల పాటు మూడు కేంద్రాల్లో ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న పరీక్షలపై సమీక్షించారు. మొత్తం 1715 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఆబ్జెక్టివ్ టైప్ ఉంటుందన్నారు. ఇలాగే ఉదయం 10 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు డిస్క్రిప్టివ్ ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటల ముందుగానే చేరుకోవాలని పేర్కొన్నారు. శ్రీ శివాని ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట)కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఈ ఐదేళ్లు ఎరువులు

ఇవ్వం





ఓవీ పేట గ్రామ ఆర్‌బీకే వద్ద వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య వాగ్వాదం (ఇన్‌సెట్లో) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కొంచాడ లక్ష్మణరావు

- ఓవీ పేటలో ఎరువుల పంపిణీలో ఘర్షణ
- వైఎస్సార్‌సీపీ వర్గంపై టీడీపీ నాయకుల దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : బూర్జ మండలం ఓవీపేటలో శనివారం ఎరువుల పంపిణీలో ఘర్షణ చోటు చేసుకుంది. కంట్లాం పంచాయతీ లచ్చయ్య పేట గ్రామస్తులు ఓవీ పేట గ్రామ ఆర్‌బీకేలో ఎరువుల పంపిణీ కార్యక్రమానికి శనివారం హాజరయ్యారు. లచ్చయ్యపేట గ్రామానికి ఎరువులు అందజేస్తున్న సమయానికి టీడీపీకి చెందిన గిరడ నాగరాజు, గిరడ దామోదరరావు తదితరులు వైఎస్సార్ సీపీకి చెందిన కొంచాడ లక్ష్మణరావు, కొంచాడ రాము, సైరిగాపు జనార్ధనరావుపై దాడికి దిగారు.

'నీ అంతు తేలుస్తాం.. ఐదేళ్లు మీకు ఎరువులు ఇవ్వం' అని లక్ష్మణరావును హెచ్చరిస్తూ ఎరువులు కూడా అందజేయలేదు. కర్రతో దాడి చేయడంతో తలపైన బలమైన గాయాలయ్యాయి. ఆయన అక్కడే కింద పడి వాంతులు చేసుకోగా.. వెంటనే 108 సాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘర్షణ అయ్యాక టీడీపీ వారు స్థానిక పోలీసు స్టేషన్‌లో తిరిగి వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. రిమ్స్ అవుట్ పోస్టు వారు ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ ఎంవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



సూచనలు చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

నరసన్నపేట: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంటకు పైగా స్టేషన్‌లో ఉండి పోలీసుల పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి దొంగతనాలు జరగకుండా చూడాలని పెట్రోలింగ్ పెంచాలన్నారు. పేకాట, జూదం వంటి ఆటలు జరగకుండా చూడాలని, ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. గంజాయి వినియోగంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. పట్టణంలో ట్రాఫిక్‌పై సీఐ ప్రసాదరావు, ఎస్ఐ అశోకబాబులకు పలు సూచనలు చేశారు.

రాజకీయ జోక్యం..

సమాఖ్యలకు శాపం



- మహిళా సంఘాల సమాఖ్య ఎన్నికల్లో రాజకీయ జోక్యాలు
- అంతా తమవారే ఉండాలని టీడీపీ నాయకుల పట్టు
- మహిళా సాధికారతకు ముప్పు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

మహిళా స్వయం శక్తి సంఘాలపై రాజకీయ నేతల కన్ను పడుతోంది. ప్రజాస్వామ్య విధానంలో ఈ సంఘాలు నిర్వహించుకునే గ్రామ, మండల, జిల్లా సమాఖ్య ఎన్నికల్లో టీడీపీ నాయకులు తలదూర్చుతున్నారు. అన్నింటా మావారే ఉండాలి, ఎక్కడైనా మా మాటే చెల్లుబాటు కావాలనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న మహిళా సంఘాల సభ్యుల మధ్య వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. మహిళా సంఘాలకు (డ్వాక్రా) గ్రామ స్థాయిలో గ్రామ సమాఖ్యలు, మండల స్థాయిలో మండల సమాఖ్యలు, జిల్లాస్థాయిలో జిల్లా సమాఖ్య ఉంటుంది. ఈ సంఘాల నిర్వహణ, బాగోగులు, ప్రభుత్వం గ్రాంట్ల వినియోగం, రుణాలు, అంతర్గత అప్పులు, ఆర్థిక లావాదేవీలు, వ్యాపార కార్యక్రమాలు వంటివి నిర్వహించేందుకు ఈ సంఘాలు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సమాఖ్యలు రూపొందించుకుంటాయి. ఈ సమాఖ్యలకు ఏడాదికి ఒకసారి ఎన్నికలు నిర్వహిస్తారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారి, ఇతర సభ్యులను ఎన్నుకుంటారు.

జిల్లాలో 1295 గ్రామ సంఘాలు

జిల్లాలో 1295 గ్రామ సమాఖ్యలు ఉన్నాయి. ఆయా మండలాల్లో 30 మండల సమాఖ్యలు ఉన్నాయి. అలాగే జిల్లా సమాఖ్య ఒకటి ఉంది. ఈ సమాఖ్యలకు ఏడాదికి ఒకసారి ఎన్నికలు నిర్వహిస్తారు. ఇప్పటి వరకు ఈ ఎన్నికలు పోటీలు లేకుండా అందరి అనుమతితో ఏకగ్రీవంగా జరగడం ఆనవాయితీగా వస్తోంది. వీటిలో గ్రామ సమాఖ్యలకు జూలై, ఆగస్టు నెలల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. మండల సమాఖ్యలకి ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎన్నికలు జరుగుతాయి. జిల్లా సమాఖ్యకి సెప్టెంబర్ నెలాఖరులో ఈ ఎన్నికలు ఉంటాయి. ఈ ఎన్నికలతో పాటు ఇతర అంశాలు డీఆర్‌డీఏకు అనుబంధంగా ఉన్న వెలుగు ఉద్యోగుల పర్యవేక్షణలో జరుగుతాయి.

ఈ ఏడాది ఇలా..

ఈ ఏడాది ఇప్పటికే జిల్లా సుమారుగా 200 వరకు గ్రామ సంఘాలకు టీడీపీ నాయకులు సిఫారసులు చేసినట్టుగానే ఎన్నికలు పూర్తి చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ఎమ్మెల్యేలు నేరుగా వెలుగు మండల స్థాయి సిబ్బందిని వారి వద్దకు పిలిపించుకుని, ఈ సారి జరగనున్న సమాఖ్యల ఎన్నికల్లో టీడీపీ సానుభూతి పరులు, ఆయా గ్రామాల్లో టీడీపీ కార్యకర్త సూచించిన వారిని మాత్రమే అధ్యక్షులుగా నియమించాలని హుకుం జారీ చేశారు. ఒక వేళ ఎన్నికలే జరిగితే అక్కడ కూడా టీడీపీ సూచించిన వారు మాత్రమే గెలిచేలా చూడాలని ఆదేశించారు. దీంతో వెలుగు సీసీలు, ఏపీఎంలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాట వినని వారిపై వేధింపులు కూడా అక్కడక్కడా జరుగుతున్నాయి.

అశాంతి రేపుతున్నారు..

ఐదేళ్లుగా మహిళా సంఘాలపై ఎలాంటి ఒత్తిడి లేదు. ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించుకుని అంతా ఒకే కుటుంబంలా వ్యవహరించేవారు. ఈ సారి ఎన్నికల్లో రాజకీయ జోక్యంతో వారి మధ్య వివాదాలు చోటు చేసుకొంటున్నాయి. టీడీపీ కార్యకర్తలు వారి పక్షాన ఉన్న మహిళలను రెచ్చగొట్టి వివాదాలకు కారణమవుతున్నారు.

పొలాలు కళకళ

వరుణుడు కరుణిస్తుండడంతో రైతు పొలం పనుల్లో బిజీ అవుతున్నాడు. దమ్ములు చేయడం, నారు తీతలు, ఉభాలు వేసే పనులు జరుగుతున్నాయి. వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, నందిగాం మండలాల్లో దమ్ములు ఊపందుకున్నాయి.

– వజ్రపుకొత్తూరు







క్లుప్తంగా

3న పౌరాణిక ఏకపాత్రాభినయ ప్రదర్శనలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 3న బాపూజీ కళామందిర్‌లో పౌరాణిక ఏకపాత్రాభినయ ప్రదర్శనలు జరుగుతాయని నిర్వాహకులు చిట్టి వెంకటరావు, ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, ఇంజరాపు రమణారావు, రామచంద్రదేవ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో శ్రీకృష్ణ, ఆంజనేయ, అర్జున, కర్ణుడు, నక్షత్రక, విశ్వామిత్ర, హరిద్వజుడు, హరిశ్చంద్ర, చంద్రమతి తదితర 30 రకాల పౌరాణిక ఏక పాత్రలు ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచే ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం జరిగే సభలో బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. ఔత్సాహికులు ఈ ప్రదర్శనలను చూసేందుకు రావలసిందిగా కోరారు.

ఇసుక లారీ పట్టివేత



పట్టుబడిన లారీ

శ్రీకాకుళం రూరల్: మండలంలోని బట్టేరు పరిసర ప్రాంతంలో లారీలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకను శనివారం రెవెన్యూ అధికారులు పట్టుకొని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. తొలుత ఇసుకను డంపింగ్ చేసిన లారీ యజమానులు పొన్నాం పరిసర ప్రాంతం గుండా ఆమదాలవలస మీదుగా తరలించేందుకు పూనుకున్నారు. అటువైపు వెళ్తున్న రెవెన్యూ అధికారులు వెంబడించి లారీను పట్టుకున్నారు. ఈ దాడుల్లో వీఆర్వోలు గణేష్, యశ్వంత్, లక్ష్మణ, రవితేజ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎఫ్‌ఓ



కలెక్టర్‌తో మాట్లాడుతున్న అటవీ అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను జిల్లా అటవీ శాఖ అధికారి శంబంగి వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా డీఎఫ్‌ఓ జి.ఎ.పి.ప్రసూన, టెక్కలి సబ్ డీఎఫ్‌ఓ ఎ.వి.నాగేంద్రరావు, పాలకొండ సబ్ డీఎఫ్‌ఓ సంజయ్, రేంజర్లు పి.అమ్మన్నాయుడు, జి.జగదీశ్వరరావు, కె.రాజశేఖర్, నిహారిక, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

జీఓ 53 మేరకు టీచర్లను నియమించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

జీఓ 117 రద్దుచేసి జీవో ఎంఎస్ నంబర్ 53 ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని, ఒకటి నుంచి ఐదు తరగతులతను ఒకే పాఠశాలగా నడపాలని యూటీఎఫ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానం అమలు చేయాలన్నారు. హైస్కూల్స్‌లో రెండు మాధ్యమాలను సమాంతరంగా కొనసాగించాలని కోరారు. హైస్కూల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, కిలోమీటర్ పైబడి దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని విన్నవించారు. కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని కోరారు.

నైపుణ్య శిక్షణ ప్రారంభమయ్యేనా?

- కూటమి ప్రభుత్వం వచ్చాక మూలకు చేరిన ట్రైనింగ్ కార్యక్రమాలు
- యువతకు తప్పని ఎదురుచూపులు

ఎచ్చెర్ల క్యాంపస్:

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగం సాధించాలంటే డిగ్రీల కంటే ప్రతిభ, ప్రమాణాలు అత్యవసరం. ముఖ్యంగా ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమల్లో పనిచేయాలంటే నైపుణ్యాలు (స్కిల్స్) తప్పనిసరి. డిగ్రీ, పీజీలాంటి ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు నిరుద్యోగులుగా మిగిలిపోకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యువతలో నైపుణ్యాల పెంపునకు ప్రాధాన్యమిచ్చింది. దీనిలో భాగంగా స్కిల్స్ శిక్షణ ఇప్పించేందుకు జిల్లాలో స్కిల్ కాలేజ్, ఐటీఐ (పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో) స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసింది. పదో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులకు స్కిల్ కాలేజ్‌లు, హబ్‌ల్లో శిక్షణలు ఇచ్చారు. విద్యార్హత, యువత ఆసక్తి పరిగణనలోకి తీసుకొని శిక్షణ అనంతరం ప్రైవేట్ పరిశ్రమలు, సంస్థల్లో ప్లేస్‌మెంట్‌లు సైతం ఇప్పించేవారు. రూ.15 వేలు నుంచి రూ.20 వేల వరకు ప్రారంభ వేతనాలతో ఉపాధి లభించేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శిక్షణలు మూతపడ్డాయి. టీడీపీ మ్యానిఫెస్టోలో శిక్షణలు ఇచ్చి ఉద్యోగాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అయినా చర్యలు మాత్రం ప్రారంభించలేదు. గ్రామ సచివాలయ ఉద్యోగులతో ఇంటింటా సర్వే నిర్వహించి, నిరుద్యోగ యువత సమాచారం ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. విద్యార్హత, అభిరుచికి అనుకులంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అమలులో మాత్రం క్షేత్రస్థాయిలో ఇప్పటి వరకు ఎటువంటి సర్వే ప్రారంభం కాలేదు. దీంతో యువత శిక్షణ కోసం ఎదురు చూస్తోంది.



మూలకు చేరిన అధునాతన కుట్టు మిషన్లు



కుట్టు శిక్షణ (ఫైల్)



ఎచ్చెర్ల టీడీడీసీలో నిర్వహించిన స్కిల్ కాలేజ్

గతంలో పకడ్బందీగా..

గత ప్రభుత్వ హయాంలో జిల్లాకొక స్కిల్ కాలేజీ ఏర్పాటు చేశారు. ఎచ్చెర్లలోని టీటీడీసీ (జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రం)ను స్కిల్ కాలేజ్‌గా తీర్చిదిద్దారు. మూడు నెలలు, రెండు నెలలు, నెల ఇలా కాల పరిమితిలో విద్యార్హత బట్టి నైపుణ్య శిక్షణ ఇచ్చారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ప్లేస్‌మెంట్ కల్పించారు. మహిళలకు సూయింగ్ మిషన్(కుట్టు) ఆపరేటర్ శిక్షణ నిర్వహించారు. 10వ తరగతి అర్హత ఉన్న మహిళలకు డ్రెస్ మేకింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ వంటి అంశాలు నేర్పించి వస్త్ర పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించారు. కొందరు విజయవాడ, విశాఖపట్నం, చెన్నై వంటి ప్రాంతాల్లో ఉద్యోగాలకు వెళ్లగా, మరికొందరు స్వయం ఉపాధి లక్ష్యంగా ముందుకు సాగారు. ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి విద్యలు పూర్తిచేసిన వారికి ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్స్ వంటి శిక్షణలు ఇచ్చి ప్రైవేట్ పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించారు. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారికి పేషెంట్ రిలేషన్ అసోసియేట్, ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ వంటి శిక్షణలు ఇచ్చి రాష్ట్రంలో పలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉపాధి కల్పించారు.హోటల్ మేనేజ్‌మెంట్, బ్యూటీషియన్ వంటి కోర్సుల్లో సైతం శిక్షణ ఇచ్చారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి శిక్షణలు మళ్లీ ప్రారంభించాలని యువత కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా..

ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా శిక్షణలు కొనసాగుతాయి. త్వరలో నైపుణ్య గణన జరుగుతుంది. ప్రత్యేక యాప్‌లో నిరుద్యోగుల పూర్తి వివరాలు నమోదు చేస్తారు. యువత అర్హత, ఆసక్తి ఆధారంగా ప్రభుత్వం శిక్షణలు డిజైన్ చేస్తుంది.

–సాయిశ్రీనివాస్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి

మండల సమావేశమా.. పార్టీ సభా?

- రణస్థలం సర్వసభ్య సమావేశంపై విమర్శల వెల్లువ

రణస్థలం: అధికారులు, గుర్తింపు ఉన్న ప్రజా ప్రతినిధులు సారథ్యంలో నిర్వహించాల్సిన మండల సాధారణ సర్వ సభ్య సమావేశం జాతరను తలపించింది. కూటమి ప్రభుత్వం రాకతో మొదటిసారిగా నిర్వహించి ఈ సమావేశంలో ఇరుపార్టీల కార్యకర్తలు, నాయకులతో సభాస్థలి నిండిపోయి చిందరవందరగా తయారైంది. దీంతో సభను నిర్వహించాల్సిన అధికారులు, అసలైన ప్రజా ప్రతినిధులు నిలబడాల్సి వచ్చింది. ఫలితంగా సభలో ప్రస్తావించాల్సిన అంశాలు, సమస్యలు పక్కదారి పట్టాయి. కొందరు నాయకులు సమస్యలను గాలికి వదిలేసి గత ప్రభుత్వంలో తమకు గుర్తింపు లేదని లోపాలను ప్రస్తావించి రాజకీయ కోణంలో విమర్శలు గుప్పించారు. గౌరవ సభలో ఇలా కార్యకర్తలు, నాయకుల ప్రమేయం ఎక్కువ కావడంతో కాసేపు గందరగోళం నెలకొంది. సమస్యల ప్రస్తావన కంటే రాజకీయంగా చేసిన విమర్శలతో సభ కొనసాగింది. సమస్యలు, అభివృద్ధిపై చర్చ జరగాల్సింది పోయి రాజకీయ విమర్శలకు వేదికగా మారడంతో అధికారులు విస్మయం చెందారు. మండల పరిషత్ కార్యాలయ సముదాయంలో ఉన్న కూరగాయల మార్కెట్ స్థల పరిశీలన విషయమై ఎంపీపీ ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావుల మధ్య చూద్దామంటే.. అలాగే చూద్దామని మాటలు విసురుకున్నారు. ఈ క్రమంలో సమస్య తగ్గించే ప్రయత్నంలో ఓ కార్యకర్త కల్పించుకోగా.. ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడే ఉన్న అధికారులు, నాయకులు, కార్యకర్తలు మిన్నుకుండిపోయారు.



కార్యకర్తలు, నాయకులతో నిండిన సర్వసభ్య సమావేశం

జాబ్‌మేళాలపై దృష్టి పెట్టాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా నైపుణ్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ యాక్షన్ ప్లాన్‌లపై చర్చించేందుకు కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు. జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించాలని పరిశ్రమలు, ఉపాధి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సహా వివిధ శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. భారీ, మధ్య తరహా, చిన్న పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు ఇప్పటికే మ్యాప్ చేశారని, పరిశ్రమ ఆధారిత నైపుణ్య శిక్షణను అందించడం, నైపుణ్యం కలిగిన యువతను ఉపాధి అవకాశాలతో అనుసంధానించడానికి తరచుగా జాబ్‌మేళాలు నిర్వహించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా మూలపేట పోర్టు, ఇంకా జిల్లాలో ప్రధాన పరిశ్రమలు, కంపెనీలు, వ్యాపార సంస్థలతో కలిసి వారి నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను రూపొందించాలని, శిక్షణ పొందిన వ్యక్తులు తగిన ఉద్యోగాలు పొందేలా ప్రణాళిక ఉండాలన్నారు. ఇటీవల గ్రాడ్యుయేట్‌లను లక్ష్యంగా చేసుకోవడంతో పాటు, ఎలక్ట్రీషియన్‌లు, వైర్‌మెన్‌లు, మోటార్ మెకానిక్‌లు, ప్లంబర్లు, మేస్త్రీలు, కార్పెంటర్లు, కుట్లు అల్లికలు వంటి వివిధ ట్రేడ్‌ల కోసం ఈ ప్రణాళికలో శిక్షణ ఉంటుందని, స్వయం ఉపాధి లేదా ప్రత్యక్ష ఉద్యోగ నియామకాలకు దారి తీసే సమగ్ర శిక్షణను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆయా శాఖల అధికారులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సమాజాభివృద్ధికి ఆలోచించాలి

టెక్కలి: ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు సమాజాభివృద్ధికి ఆలోచనలు చేయాలని విశాఖపట్నం ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగాసె అన్నారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన పట్టభద్రుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో శ్రమించి ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలు నెరవేరుస్తునే.. కొత్త ఆలోచనలకు పదును పెట్టి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా రెండు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కళాశాల అందజేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు బంగారు పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల బీఓజీ గవర్నర్ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాద్‌రెడ్డి, కళాశాల కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, కె.రవికుమార్, కె.మధుకుమార్, టి.నాగశేషు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాస్, డీన్లు పాల్గొన్నారు.



పట్టభద్రుల దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగాసె, ప్రొఫెసర్ ప్రసాద్‌రెడ్డి

డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల నాలుగో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి శనివారం కళాశాలలో విడుదల చేశారు. బీఏలో 74.24 శాతం, బీఎస్సీలో 55.56 శాతం, బీకాం జనరల్‌లో 69.77 శాతం, బీకాం ఒకేషనల్‌లో 90.00 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు వారు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను, లెక్చరర్లను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకాడమిక్ కో–ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పీఎస్ కనకదుర్గ, ప్రశాంతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ సీహెచ్ కాత్యాయని, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్ర, అధ్యాపకులు

నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన క్రిమినల్ చట్టాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసులు మరింత అవగాహన పెంచుకుని న్యాయవ్యవస్థ, బాధితులకు తోడ్పాటును అందించాలని ఏపీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరి రామకోటేశ్వరరావు సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టుల పోలీస్ లైజనింగ్ ఆఫీసర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలక్ష ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి ప్రారంభమైన నూతన క్రిమినల్ చట్టాలపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ అజయ్ లాం, సుబ్బలక్ష్మి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం పీపీ మెట్ట మల్లేశ్వరరావు, వివిధ కోర్టుల పీపీలు వాన కృష్ణచంద్, తంగి శివప్రసాదరావు, కోత తిరుమలరావు, సీహెచ్ శ్రీకాంత్, కె.శంకరరావు, సీహెచ్ సత్యనారాయణ, ఎల్.వి.రమణ, పి.ఉషాసింగ్, ఉషారాణి, పి.సుశీల, ఎల్.నాగభూషణరావు, కె.సూర్యకుమార్, ఎల్.రఘునాథ్, ప్రియదర్శిని ఆర్.శాంతిసంతోషి, జి.విజయలక్ష్మి, డి.హరిప్రియ, రమేష్, జిల్లా కోర్టు పోలీస్ లైజన్ ఎస్ఐ జి.నాగమణి, అదనపు ఎస్ఐలు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసులు

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



రమేష్(ఫైల్)

రణస్థలం: మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలస గ్రామానికి చెందిన ధర్మాన రమేష్ (23) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మాన రమేష్ కుటుంబ గొడవల నేపథ్యంలో శనివారం ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయారు. సాయింత్రం 5 గంటల సమయంలో సీతంవలస కొండ సమీపంలోని తోటలో చెట్టుకు ఉరివేసుకుని రమేష్ చనిపోయి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శ్రీకాకుళం శవ పంచనామాకు తరలించారు. మృతుడు రణస్థలంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. తండ్రి ఈశ్వరరావు, తల్లి రామలక్ష్మి, సోదరుడు నరేష్ ఉన్నారు. వివాహేతర సంబంధమే ఆత్మహత్యకు కారణమని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



జేసీని కలిసిన వీఆర్‌వో సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతన జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ను శనివారం వీఆర్వోల సంఘం ప్రతినిధులు గౌరవపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మూడున్నరేళ్లుగా పదోన్నతులు లేవని, వెంటనే కల్పించేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు వంజరాపు రమేష్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, గౌరవాధ్యక్షుడు ప్రగడ వేణుగోపాలరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ వీఆర్ఎల్ శాస్త్రి, కో–ఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీపీ బ్రాంచ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్:

శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న సీసీపీ (కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్) నాన్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విభాగాధిపతి డాక్టర్ ఎం.ఎల్.కామేశ్వరి కోరారు. శనివారం కళాశాలలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 31న ఉదయం 9.30 గంటలకు ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు చెప్పారు. పాలిసెట్– 2024 రాయని వారు సైతం అర్హులని పేర్కొన్నారు. ఈ కోర్సులో కంప్యూటర్, కామర్స్, షార్ట్ హ్యాండ్, టైపింగ్ వంటి సబ్జెక్టులు ఉంటాయని తెలిపారు. 2023–24లో రిలీవైన 11 మంది విద్యార్థులు విశాఖకు చెందిన సినర్జీ కాస్టింగ్ లిమిటెడ్ నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఎంపికయ్యారని చెప్పారు. 10వ తరగతి మార్కుల జాబితా, టీసీ, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ, కుల, ఆధార్ కార్డు ఐదు జిరాక్సుల సెట్‌తో పాటు, ఐదు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, పాలిసెట్ ర్యాంకు ఉంటే ర్యాంకు కార్డుతో హాజరు కావాలన్నారు. వివరాలకు 9440128522, 7989821637 నంబర్లను సంప్రదించాలని కోరారు.

● చిన్నారి దేవుళ్లు



శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలలో భాగంగా పొన్నాడ బ్రిడ్జి వద్ద ఇస్కాన్ జగన్నాథ మందిరం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వేషధారణలు నిర్వహించారు. శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన పోటీలలో సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో రామాయణం, మహాభారతం, శ్రీకృష్ణ లీలలపై చిన్నారులు వేషాలతో అలరించారు. విజేతలకు ఆగస్టు 27న కృష్ణాష్టమి నాడు బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధి లక్ష్మీపతి గౌర, న్యాయనిర్ణేతలు, విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు. – శ్రీకాకుళం కల్చరల్

రైతు భరోసా కేంద్రంలో చోరీ

రణస్థలం : మండలంలోని సంచాం పంచాయతీ పున్నానపాలెం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రంలో చోరీ జరిగిందని గ్రామ సర్పంచ్ రెడ్డి సూర్యకాంతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 26న గ్రామ సచివాలయ ఉద్యోగి వెళ్లగా కేంద్రం తాళం పగలు గొట్టి ఉండటం గుర్తించారని, లోపలికెళ్లి చూడగా కొత్తగా వేసిన మూడు ఫ్యాన్లు, ఐదు ట్యూబ్ లైట్లు, వైర్లు, బోర్డులు దుండగులు పట్టుకుపోయినట్లు తేలిందన్నారు. ఈ మేరకు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని జె.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావుకు విన్నవించారు.

రెండు రోజుల కౌన్సెలింగ్‌లో 863 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ఎం పురం క్యాంపస్‌లో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సుకు నిర్వహిస్తున్న ప్రవేశాల కౌన్సెలింగ్ శనివారం ముగిసింది. రెండు రోజుల పాటు శుక్ర, శనివారాలు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ రెండు రోజుల్లో 1035 మందిని పిలవగా, 863 మంది హాజరయ్యారు. ప్రత్యేక రిజర్వేషన్ మినహాయించి 172 సీట్లు మిగిలిపోయాయి. మిగుల సీట్లకు మళ్లీ ఆగస్టు మొదటి వారంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకున్న జాబితాలో 10వ తరగతి మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. మరో పక్క ప్రస్తుతం సీట్లు లభించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో క్యాంపస్‌లు మార్చుకునే అవకాశం కల్పిస్తారు. ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలుకు మార్పులు చేసుకోవచ్చు. అక్కడి విద్యార్థులు సైతం ఇక్కడికి ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మరో పక్క 74 సీట్లు ప్రత్యేక రిజర్వేషన్లకు కేటాయించారు. ఈ రిజర్వేషన్లలో క్యాప్, స్కౌట్ ఎంపిక పూర్తి కాగా, దివ్యాంగ, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్సు, ఆంగ్లోఇండియన్ వంటి రిజర్వేషన్ కేటగిరీలకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో ఉన్నాయి.



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

మొదటి విడత కౌన్సెలింగ్ ఆగస్టు 15నాటికి పూర్తిచేసి, ఆగస్టు నెల చివరినాటికి క్లాస్‌వర్క్ ప్రారంభించాలన్న లక్ష్యంతో అధికారులు ఉన్నారు. క్యాంపస్‌లో ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ రిజర్వేషన్‌లో కలిపి 1100 సీట్లు ఉండగా, 1110 సీట్లతో మెరిట్ లిస్ట్ ప్రారంభించారు. దరఖాస్తు చేసుకున్న కొందరు మెరిట్ విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ, మెడిసిన్ వంటి లక్ష్యాలతో ఇంటర్మీడియెట్‌లో చేరారు. 172 మంది గైర్హాజరయ్యారు. ఆర్‌జీయూకేటీకి ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వెయిటేజీ కారణంగా 93 శాతం ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపికయ్యారు. ఏడు శాతం మాత్రమే ప్రైవేట్ పాఠశాలల నుంచి ఎంపికయ్యారు. రెండో రోజు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కౌన్సెలింగ్ కొనసాగింది. అధికారులు పూర్తిస్థాయిలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. కౌన్సెలింగ్‌ను డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, ఏఓ ముని రామకృష్ణ, కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ పి.గోవర్ధనరావు, సహాయ కో ఆర్డినేటర్ రమణ, పీఆర్‌ఓ మాడిమి షణ్ముఖ పర్యవేక్షించారు.